# మళ్లీ.. గద్దెనెక్కించండి

## తెదేపాకు పట్టం కట్టండి ★ 12 గంటలు విద్యుత్తునిస్తా ★ పేదరికాన్ని పూర్తిగా తరిమేస్తా

## సంక్షేమానికి 20 హామీలు.. ★ చంద్రబాబు ఆత్మీయ వచనాలు

కర్నూలు, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనే తన లక్ష్యమని, పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తానని తెదేపా అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. మీకోసం యాత్రలో భాగంగా కర్నూలు జిల్లాలో అడుగుపెట్టిన ఆయన 20 స్పష్టమైన హామీలతో జనాన్ని ఊరడించారు. విద్యుత్తు సరఫరా లోపంతో పాటు ప్రస్తుతం తప్పుడు బిల్లులు వస్తున్నాయని తాము అధికారంలోకి వస్తే రెండు బల్బులు, ఒక ఫ్యాను, ఒక టీవీ ఉన్న ఇళ్లకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తామన్నారు. పేదలకు ప్రస్తుతం అందచేస్తున్న కిలో రూ.2 బియ్యం పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులకు కాకుండా వయసులో ఉన్న వారికి ఫించన్లు ఇస్తోందని.. అత్తకు కాకుండా కోడలికి, తండ్రికి కాకుండా కుమారుడికి పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఎద్దేవా చేశారు. తాము వృద్ధులకు రూ. 500 పింఛను ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. ఇందిరమ్మ గృహాలు కట్టుకున్న వారు అప్పుల పాలై బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. తాము మూడు సెంట్ల స్థలం అందించడంతో పాటు గృహ నిర్మాణానికి రూ. లక్ష నిధులు కేటాయిస్తామన్నారు. పాత ఇళ్లకు ఉన్న బకాయిలన్నీ మాఫీ చేస్తామని, పేదలు తమ ఇళ్లను మరమ్మతులు చేసుకోవాలంటే ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులకు ఉన్న అప్పులను పూర్తిగా మాఫీ చేసి ప్రత్యేక ప్యాకేజిని ప్రకటిస్తామన్నారు. రూ.1.25 లక్షలతో చేనేత మగ్గం ఉన్న ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. రూ.500 కోట్లతో మైనార్టీలకు ప్యాకేజి అమలు చేస్తామని చెప్పారు. 27 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం ఆ గ్యాస్ ఉన్న మహిళలందరికీ ఉచితంగా సిలిండర్లు అందచేస్తామన్నారు. వెలుగు ప్రాజెక్టులో ఉన్న రుణాలన్నీ పూర్తిగా మాఫీ చేస్తామంటూ ఆడపిల్లలకు మూడు గ్రాముల బంగారం పెళ్లిళ్ల సమయంలో అందించి ఆదుకుంటామన్నారు. బెల్టు దుకాణాలను పూర్తిగా రద్దు చేసి మద్యం దుకాణాలను నియంత్రిస్తామన్నారు. నిరుద్యోగులందరికీ రూ.1000 జీవన భృతిగా అందిస్తామని, హైస్కూల్ లోపు పిల్లలందరికీ సైకిళ్లు అందచేస్తామని హామీ ఇచ్చారు. రెండు జతల బట్టలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలందరికి ఇస్తామని చెప్పారు. వాల్మీకులను షెడ్యూల్డు తెగల జాబితాలో కలుపుతామని ప్రకటించారు. రైతులకు 12 గంటల పగటి విద్యుత్తు నాణ్యంగా, అదీ ఉచితంగా అందిస్తామన్నారు. రైతులకు ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఏ ఒక్కరూ రుణాలు కట్టవద్దని వాటిని పూర్తిగా మాఫీ చేస్తామని తెలిపారు. రూ.3 వేల కోట్ల చేనేతల కోసం ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేసి 10 పైసల వడ్డీతో రుణాలను అందిస్తామన్నారు. వికలాంగులకు నెలకు రూ. 1000 భృతిగా అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి తెలుగుదేశం పార్టీని



కర్నూలు జిల్లా నందవరంలో 'మీకోసం' కార్యక్రమంలో గురువారం రాత్రి ప్రసంగిస్తున్న తెదేపా అధినేత చంద్రబాబునాయుడు

అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అధికారంలోకి తీసుకువచ్చి సంక్షేమాన్ని కోరాలని సూచించారు. చంద్రబాబు ప్రకటిస్తున్న హామీల పట్ల సంతసించిన జనం చప్పట్లతో ఆమోదాన్ని తెలిపారు.